www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నాలుగో అదనపు జిల్లా జడ్జి సత్యవతి

తణుకు : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో తణుకు కోర్టు పరిధిలో ఉన్న 7 మండలాల నుంచి వచ్చిన పారా లీగల్ వాలంటీర్లు(న్యాయ సేవా సహాయకులు) శిక్షణ తరగతులను ప్రారంభించి, పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పారా లీగల్ వాలంటీర్లను నియమిస్తున్నామని తెలిపారు. చట్టానికి లోబడి పనిచేయాలని, గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సలహా, సహాయం అందించాల్సిన బాధ్యత పారా లీగల్ వాలంటీర్లపై ఉన్నదన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి.. వట్లూరు భూములు..!



'పెదపాడు మండలం వట్లూరులో 350 ఎకరాల భూములు ఉన్నాయి. ఆ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఈ నెల 16వ తేదీన జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ మాట్లాడిన మాట.'

'ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉంది. గతంలో ఆ భూములను ఎపిఐఐసికి ప్రభుత్వం కేటాయించిందని అధికారులు సమాధానం.'

'వట్లూరు భూములకు సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఆ భూముల్లో ఏదైనా చేయాలంటే కోర్టు కేసులు పరిష్కరించడంతోపాటు, రైతులకు పరిహారం ఇవ్వాలి. అక్కడ ఏదైనా పనులు మొదలు పెడితే రైతులు మళ్లీ ముందుకొచ్చే అవకాశం ఉంది.': దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

అప్పట్లో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం

ఇప్పటికీ రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వని పరిస్థితి

2016లో అడ్డగోలుగా భూములు లాక్కోవడంతో ఎన్నో కుటుంబాలు ఛిద్రం

ఆ భూములను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించాలంటున్న ప్రజా ప్రతినిధులు

కోర్టుకేసులు, ఇతర అంశాలపై నివేదిక ఇవ్వాలన్న ఇన్‌ఛార్జి మంత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వట్లూరు పెదచెరువుకు చెందిన భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఏలూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందుకు సంబంధించి ప్రభుత్వ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా అధికారులు 1595.70 ఎకరాల భూమి మాత్రమే అందుబాటులో ఉందని తేల్చారు. ఆ భూములు కూడా ప్రతి మండలంలో కొద్ది మొత్తంలో మాత్రమే ఉన్నాయని అధికారులు తేల్చారు. ఈ నెల 16వ తేదీన కలెక్టర్ ప్రాంగణంలోని గోదావరి సమావేశ మందిరంలో డిఆర్‌సి (జిల్లా సమీక్షా సమావేశం) జరిగింది. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుపై చర్చలో భాగంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వట్లూరు పెదచెరువు భూముల ప్రస్తావన లేవనెత్తారు. అక్కడ ఉన్న 350 ఎకరాలను పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించుకుంటే బాగుంటుందని తెలిపారు. ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉందని అధికారులు తెలిపారు. అంతే తప్ప 2016లో ఆ భూములకు సంబంధించి ఏం జరిగింది. ఎందుకు కోర్టులో కేసు నమోదైందో అధికారులు పూర్తిగా వివరించలేదు. చెరువు భూములను ఎపిఐఐసికి ఏ విధంగా కేటాయించారన్న ప్రజా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది. అప్పట్లో బలవంతంగా రైతుల నుంచి వట్లూరు భూములను లాక్కోవడంతో ఎంతో మంది రైతులు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైతులకు పరిహారం అందించి న్యాయం చేస్తారా అన్న చర్చ అక్కడి రైతుల్లో నెలకొంది.

వట్లూరు భూముల కథ ఇది..!

టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వట్లూరు పెదచెరువు భూముల్లో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పెదపాడు మండలం వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 495, 496, 497లోనూ పెదవేగి మండలంలోని సర్వే నంబర్ 210 – 29 పరిధిలో దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. ఈ భూములను దాదాపుగా 300 మంది సన్న, చిన్నకారు రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఇవి వట్లూరు పెదచెరువు భూములుగా ఉన్నాయి. చట్ట ప్రకారం చెరువు భూములైనప్పటికీ రైతుల సాగులో ఉన్న భూములను స్వాధీనంలో ఉన్నప్పుడు పరిహారం చెల్లించి తీసుకోవాలి. ఇక్కడ మాత్రం అటువంటి ప్రక్రియ జరగలేదు. భూముల సేకరించే సమయంలో రైతులు దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేశారు. దీంతో ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. ఇప్పటివరకూ రైతులకు చిల్లిగవ్వ పరిహారం అందలేదు. భూములను బలవంతంగా లాక్కోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఆసరాను కోల్పోయి రోడ్డున పడ్డాయి. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమిపాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి రైతుల గురించి పట్టించుకోలేదు. పరిశ్రమ ఏర్పాటు జరగలేదు. 2022లో వెమ్ టెక్నాలజీ చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ఆ భూములను ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. దీనిపై కోర్టులో కేసు సైతం ఉంది. ఈ భూములకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ డిఆర్‌సి సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.

రీసర్వేపై అవగాహన పెంచుకోవాలి

జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం

రీసర్వేపై అవగాహన పెంచుకుని మంచి ఫలితాలు తీసుకురావాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో జిల్లా ఇన్‌ఛార్జి సర్వే అధికారి, తహశీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేలు, గ్రామాల సర్వేయర్లు, విఆర్‌ఒలకు వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో నాలుగో దశ రీసర్వే పనులపై అవగాహనా సదస్సు జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సదస్సులో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రీ సర్వేపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రికార్డులు పారదర్శకగా నిర్వహించాలని చెప్పారు. విలేజీ బౌండరీ కచ్చితంగా పాటించాలని, ప్రభుత్వ భూములకు సంబంధించి శాఖల వారీగా ఇరిగేషన్, డ్రెయినేజీ, దేవస్థానం జిల్లా పరిషత్ భూములకు సంబంధించి ముందుగా నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించాలన్నారు. రైతుల భూములకు ముందుగా నోటీసులు ఇచ్చి రైతుల ఆధ్వర్యంలో సర్వే చేయాలని, లేకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలను జారీ చేసి జెసి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ దాసి రాజు, ఇన్‌ఛార్జి జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్‌విఆర్‌కె.ప్రసాద్, సర్వే పరిశీలకులు ఎన్.కరుణాకర్, నరసాపురం రెవెన్యూ డివిజన్ తహశీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

నేడు రేషన్ డీలర్ల నియామకానికి రాత పరీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో 20 చౌక దుకాణాలు ఏర్పాటుకు 63 దరఖాస్తులు వచ్చాయని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం నరసాపురంలోని వైఎన్ కళాశాల ఎంసిఎ బ్లాక్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఇప్పటికే పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు.


తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 51 చౌక దుకాణాల్లో డీలర్ల నియామకానికి రాత పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బనో తెలిపారు. శనివారం సాయంత్రం ఆర్‌డిఒ మీడియాతో మాట్లాడతూ అత్తిలిలో ఏడు దుకాణాలకు 12 మంది, ఇరగవరం మండలంలో నాలుగు దుకాణాలకు ఇద్దరు, పెంటపాడు మండలంలో ఆరు దుకాణాలకు 12 మంది, తాడేపల్లిగూడెంలో 11 దుకాణాలకు 48 మంది, తణుకు మండలంలో 23 దుకాణాలకు 68 వెరసి 51 దుకాణాలకు గాను 174 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 142 మందిని పరీక్షకు అర్హులుగా ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన వారికి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్జీదారులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

తణుకు బాలోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టపడి చదువుకునే వాతావరణం కల్పించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయం వద్ద ఈనెల 24, 25 తేదీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే బాలోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచులను, సృజనాత్మకతను ప్రోత్సహించే పరిస్థితులను బాలోత్సవాలు కల్పిస్తాయని అన్నారు. తణుకు పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులను ఈ సంబరాల్లో పాల్గొనేటట్లు యాజమాన్యాలు, తల్లిదండ్రులు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు, పి.దక్షిణామూర్తి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

చట్టమా.. చుట్టమా..!

ఏదైనా ఘటన జరిగినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వ పెద్దలు పదేపదే చెబుతుంటారు. అదే సమయంలో ప్రజలకు ఇబ్బందికరమైన చర్యలేమైనా అధికారులు తీసుకుంటే ఇదేంటంటూ ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తే తాము చట్టప్రకారం ముందుకెళ్తున్నామని, కోర్టు ఆదేశాల మేరకే చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండడం సర్వ సాధారణం. కానీ రెండు జిల్లాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెబుతున్నట్లు చట్టప్రకారమే వ్యవహరిస్తున్నారా, కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారా అంటే కాదనే సమాధానం జనం నోటి నుంచి వస్తోంది. సంక్రాంతి సాంప్రదాయం మాటున కోడిపందేలు పండుగ మూడు రోజులు యథేచ్ఛగా సాగాయి. వాటికి అనుసంధానంగా గుండాట, పేకాట వంటి జూదాలకు అడ్డూఅదుపూ లేనేలేదు. మద్యం ఏరులై పారింది. మొత్తంగా చూస్తే వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి. మరి ఇవన్నీ కోర్టు ఆదేశాలకు లోబడి సాగాయా, చట్ట ప్రకారమేనా అనేది అధికారులే చెప్పాల్సి ఉంది. పండుగకు ఒకరోజు ముందు వరకూ రెండు జిల్లాల్లోనూ ఉన్నతాధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకూ అంతా కోడిపందేలకు అనుమతి లేదని, నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఘీంకరించారు. కొన్ని ప్రాంతాల్లో కోడిపందేల బరులను సైతం ధ్వంసం చేశారు. ఇంతవరకూ చాలా బాగుందని జనం సైతం సంతోషం వ్యక్తం చేశారు. ఏమైందో ఏమో గాని గతానికి భిన్నంగా భోగి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచే జిల్లాలో పెద్దఎత్తున పందేలు సాగడం అందరినీ విస్మయపర్చింది. జిల్లా అధికారుల నుంచి మండలస్థాయి అధికారుల వరకూ ఎవరూ బహిరంగంగా కనిపించిన పరిస్థితి లేదు. పైగా పందేల నిరోధానికి ఏర్పాటు చేసిన కమిటీలు కూడా పత్తాలేకపోవడం గమనార్హం. ఇదంతా చూస్తే పండుగకు ముందు అధికారుల హడావుడి అంతా కేవలం తాము అన్ని చర్యలూ తీసుకున్నామని కోర్టుకు చెప్పుకునే దానిలో భాగమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సామాన్య ప్రజల విషయంలో అయితే కోర్టు ఆదేశాల పేరుతో దుందుడుగ్గా వ్యవహరించడం అధికారులకే చెల్లిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంలోనే ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. అధికార పక్షానికి వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష నేత అనుచరులు నిర్వహిస్తున్న పందేల బరిని పోలీసులు అడ్డుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పందేలను అడ్డుకుంటే మొత్తంగానైనా, లేదా ఓ ప్రాంతంలోనైనా అడ్డుకోవాల్సి ఉంది. దానికి భిన్నంగా ఒకే గ్రామంలో అధికార పార్టీ అనుచరులు పందేలు నిర్వహిస్తుంటే అటువైపు కన్నెత్తి చూడకుండా ప్రతిపక్ష నేత అనుచరులు ఏర్పాటు చేసిన పోలీసు బలగాలు మోహరించడం దేనికి సంకేతమో జిల్లా అధికారులే చెప్పాలి.



చట్టాలు, కోర్టులు ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కడం ఏజెన్సీలోని కొందరు అధికారులకు పరిపాటిగా మారింది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులు ఉంటాయనేది అందరికీ తెలిసిందే. ఈ అంశం ఆయా ప్రాంతంలో పనిచేసే రెవెన్యూ అధికారులకు పట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రధానంగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు సంబంధించి వివాదాలు తలెత్తినప్పుడు రికార్డుల పరిశీలన చేసి చట్టప్రకారం నిర్ణయాలు తీసుకోవడం గతంలో అధికారులు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. ఎస్‌డిసి కోర్టు ఇచ్చిన తీర్పును సైతం పక్కనపెట్టి గిరిజనులకు చెందాల్సిన భూముల్లో పంటలకు గిరిజనేతరులకు ప్రొటక్షన్ ఆర్డర్లు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. కనీసం రికార్డు పరిశీలన చేయకపోవడం విశేషం. ఒకవేళ పొరపాటున ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంలో ఇదేంటని ప్రశ్నించిన గిరిజనులు, గిరిజనేతరుల పట్ల కనీస విచక్షణ లేకుండా దుందుడుగ్గా వ్యవహరించడం బుట్టాయగూడెం మండల రెవెన్యూ అధికారులకే చెల్లిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే తరహాలో జీలుగుమిల్లిలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సాగించిన వ్యవహారాలు అందరికీ తెలిసిందే. దీనిపై ప్రజా ఆందోళనతో ఉన్నతాధికారులు పరిశీలించి సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు విధించిన విషయమూ ఏజెన్సీ అధికారులకు తెలియంది కాదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఏజెన్సీలో గిరిజనుల బతుకులు చిన్నాభిన్నం చేయకుండా వారి మనుగడ ప్రశ్నార్థకం చేయకుండా గిరిజన చట్టాల ప్రకారం అధికారులు వ్యవహరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వియస్ఎస్వి.ప్రసాద్



పెంటపాడు : చీపురు పట్టి శుభ్రం చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజారోగ్య రక్షణలో చిరు వ్యాపారులే తొలి వైద్యులు

ఫిబ్రవరి ఒకటి నుంచి ఆహార తనిఖీలు

కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చిరు వ్యాపారులు లాభసాటి వ్యాపారంతో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చడలవాడ నాగరాణి అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద స్వచ్ఛత, కల్తీ లేని ఆహారంపై చిరు వ్యాపారులతో (బండ్లపై ఆహార పదార్థాలు అమ్మేవారు) ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ శుచి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు చిరు వ్యాపారులు కృషి చేయాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమం 12 నెలల పాటు ప్రతినెల మూడో శనివారం పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, కల్తీ లేని ఆహార పదార్థాలు తదితర అంశాలపై కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎక్కువ కాలం జీవించాలన్నా, ఆరోగ్యంగా ఉండాలన్నా నాణ్యమైన ఆహారాన్ని స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. చిరు వ్యాపారులు కల్తీ లేని నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్లాస్టిక్ రహిత వస్తువుల్లో అందించాలని సూచించారు. కలుషిత ఆహారం వల్ల పిల్లలు, పెద్దలకు జీర్ణాశయ సమస్యలు, అవయవాలపై దుష్ప్రభావం, అవయవాల నిర్మాణంలో లోపం, పిల్లల ఎదుగుదల లోపం సృష్టిస్తున్నాయని దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. హోటళ్లు, బండ్లపై విక్రయించే ఆహార పదార్థాల తనిఖీకి ఆర్‌డిఒ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఫిబ్రవరి 1 నుండి కమిటీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం కారణంగా కిడ్నీ, కేన్సర్ వంటి రోగాల బారిన పడి ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కల్తీ నూనె, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్, పాలల్లో కల్తీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని అన్నారు. టేస్టింగ్ సాల్ట్ నాలుగు సంవత్సరాలుగా తీసుకున్న ఒక వ్యక్తికి కిడ్నీ పోయిందని, టేస్టింగ్ సాల్ట్ ఎట్టి పరిస్థితుల్లో హోటల్స్, చిరు వ్యాపారులు ఆహార పదార్థాల్లో కలపొద్దని తెలిపారు. నిల్వ పదార్థాలను, మాంసాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రఘు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బజార్లు తదితర ప్రదేశాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా శుభ్రపర్చాలన్నారు. వీధుల్లో చెత్త వేయొద్దని తెలిపారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రమాణానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతిచ్చి పరిశుభ్రతను పాటించాలన్నారు. తొలుత కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ స్వయంగా రోడ్డును ఊడ్చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ బానో, డిపిఒ అరుణశ్రీ, తహశీల్దార్ వై.శ్రీనివాస్, ఎంపిడిఒ సిహెచ్ బాలాజీ వెంకట రమణ పాల్గొన్నారు.

భీమవరం : స్వచ్ఛ పశ్చిమగోదావరి జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని భీమవరం ఆదర్శనగర్ పార్కులో కలెక్టర్, స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయలతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. స్వయంగా చెత్తను తొలగించి శుభ్రపరిచారు. స్థానిక ప్రజలతో పరిశుభ్రతపై, ప్లాస్టిక్‌ను నిరోధించడంపై పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మన గృహం, మన పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని, మన గృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచినప్పుడే సమాజ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. పెళ్లిళ్లు, తదితర కార్యక్రమాలకు పెద్ద ఎత్తున డిస్పోజబుల్ వస్తువులను వినియోగించడం జరుగుతుందన్నారు. ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గ్రామాలు, పట్టణాలను ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రంగా ఉంచేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు పూర్తి అవగాహనతో పరిశుభ్రతను కలిసికట్టుగా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రజలు, నాయకులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది అందరితో ఎంఎల్ఎ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు కొప్పునీడి బాబి, రామ సత్యనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

దళితవాడల్లో శ్మశానవాటికల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గణపవరం

అర్ధవరం దళితవాడల్లో శ్మశానవాటిక సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, సిఐటియు మండల అధ్యక్షులు మేడిశెట్టి పెంటారావు ప్రభుత్వాన్ని కోరారు. దళితవాడల్లో సమస్యలపై సర్వే చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులోభాగంగా శనివారం అర్ధవరంలోని దళితవాడల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 500 వందల కుటుంబాలున్న దళితులకు మాత్రం కేవలం 26 సెంట్ల శ్మశానవాటిక ఉండడం ప్రభుత్వం తీరుకు నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అరెకరం భూమిని దళితల శ్మశానవాటిక కోసం ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు వంద రోజులు సరిపోవడం లేదని, పనులు 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరవై సంత్సరాల నుంచి రూ.20, రూ.30 పెట్టి తాగునీరు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్మశానవాటిక సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.




అర్ధవరంలో దళితులతో మాట్లాడుతున్న నాయకులు

గీత కార్మికులపై ఎక్సైజ్ దాడులు ఆపాలి

గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

తణుకు : గీత కార్మికులపై ఎక్సైజ్ అధికారుల దాడులు తక్షణం ఆపాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. శనివారం తణుకులోని స్థానిక అమరవీరుల భవనంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ బెల్టు షాపులు, అక్రమ మద్యం అరికట్టలేని ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారు గీత కార్మికులపై దాడులు చేసి అవమానపరుస్తున్నారని, చూస్తూ ఊరుకోబోమని నరసింహమూర్తి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో గీత వృత్తిని కాపాడతామని, గీత కార్మికుల కార్పోరేషన్‌ని నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత గీత కార్మికుల పైనే దాడులు చేయడం దుర్మార్గమన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి, విడిగా లెక్కలేకుండా వ్యాపారాన్ని సాగిస్తున్నారని, దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు తోడైయ్యారన్నారు. దీనివల్ల కల్లు అమ్మకాలు లేక గీత కార్మికుల కుటుంబాలు పస్తులతో ఉంటున్నారని నరసింహమూర్తి అన్నారు. గీత కార్మికులకు పెన్షన్లు ఎటువంటి ఆంక్షలు లేకుండా 50 సంవత్సరాలకే ఇవ్వాలని, గీత కార్మికులకు వడ్డీ లేని ఋణాలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు కడలి పాండు, బొంతు శ్రీనివాసు, బొక్కా చంటి, కాసాని శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వయోజన నిరక్షరాశులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల సమైక్య భవనంలో శనివారం ఎపిఎం లక్ష్మి ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడల్ట్ ఎడ్యుకేషన్ ఎపిఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ వయోజన నిరక్షరాస్యులంతా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, అక్షరాస్యులుగా ముందుకు వెళ్లాలన్నారు. దీనికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారాలు అందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా వయోజన నిరీక్షణకు ప్రభుత్వం అందించే పుస్తకాల కిట్లను అందించారు.

రేపటి నుంచి పశు వైద్య శిబిరాలు

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని పశువైద్య అధికారిణి గొట్టుముక్కల నీలిమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుఆరోగ్య శిబిరాల నిర్వహణకు మండలం రెండు బృందాలుగా పశువులకు వైద్య సేవలు అందించనున్నామన్నారు. మండలంలో పశువుల పెంపకం రైతులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరుచుకోవాల్సిందిగా నీలిమ కోరారు. మండలంలోని మొగల్తూరు, కేపీ పాలెం నార్త్ గ్రామాలలో పశువైద్య శిబిరాలు సోమవారం నిర్వహించనున్నామని వైద్యాధికారిని నీలిమ తెలిపారు.

మాధవనాయుడుకు పరామర్శ


ప్రతాప్ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్యామలాదేవి

నరసాపురం: మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు తండ్రి, మాజీ సర్పంచి బండారు ప్రతాప్ నాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం మాజీ కేంద్ర మంత్రి యువి.కృష్ణంరాజు భార్య ఉప్పలపాటి శ్యామలా దేవి సరిపల్లి గ్రామంలో ప్రతాప్ నాయుడు కుమారుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

మండలంలోని సరిపల్లి గ్రామ దేవత శ్రీగోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి యువి.కృష్ణంరాజు భార్య ఉప్పలపాటి శ్యామలా దేవి, నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి సర్పంచి ఈద సురేష్, రేఖపల్లి సురేష్ పాల్గొన్నారు.

20న ఉచిత మెగా షుగర్ వైద్య శిబిరం

మొగల్తూరు : భీమవరంలోని డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నామని యు.శ్యామలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి, రెబల్ స్టార్ యువి.కృష్ణంరాజు జయంతి పురస్కరించుకుని శ్యామలాదేవి ఆధ్వర్యంలో షుగర్ వ్యాధి నిపుణులు వేణు కవర్తపు, భీమవరంలోని వర్మ హాస్పటల్ అధినేత పిఆర్‌కె వర్మ పర్యవేక్షణలో ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నామని ఆ ప్రకటనలో తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

కాళ్ల : కాళ్లకూరు గ్రామం దాసరపేటలో ఓలుపు రాంబాబు(45) అనారోగ్యంతో మృతిచెందారు. పేద కుటుంబం కావడంతో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చి దహన సంస్కారాల నిమిత్తం రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని ఓలుపు రాంబాబు తల్లితండ్రులు ఓలుపు శ్రీరామమూర్తి, ఓలుకు చిట్టమ్మకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 21, 22 తేదీలో జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం!

భీమవరం టౌన్ : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టిఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీల్లో 'నిపుణ 25' పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను కళాశాల మేనేజ్మెంట్ మీటింగ్ హాల్లో కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ఐఎస్‌టిఇ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎస్.రామ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత 19 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్న నిపుణ జాతీయస్థాయి విద్యార్థి సింపోజియంలో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అన్ని బ్రాంచుల విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ సింపోజియం విద్యార్థుల సాంకేతిక, ఇతర నైపుణ్యాలు ప్రదర్శించటానికి, అభివృద్ధి చేసుకోడానికి మంచి వేదిక అవుతుందన్నారు. సుమారు ఐదు విభాగాలకు చెందిన 17 ఈవెంట్లు రెండు రోజుల పాటు జరిగే ఈ సింపోజియంలో నిర్వహించి విజేతలకు బహుమతులు కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వి.పవన్ సాయి నాగేంద్ర, ఐఎస్‌టిఇ స్టూడెంట్స్ టీం పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో శ్రీగోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం రాత్రి పోటీలు ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం ప్రారంభమైన ఈ పోటీలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పురుషుల విభాగంలో 19 జట్లు, మహిళల విభాగంలో 11 జట్లు తలబడ్డాయి. పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగాయి. శనివారం రాత్రి జరిగిన పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్ పాల్గొన్నారు.

'వ్యవసాయ శాఖ రైతులకు సహకరించాలి'

పెనుమంట్ర : వ్యవసాయ శాఖ అధికారులు వరికి సంబంధించి రైతులకు ఇప్పటి కప్పుడు సకాలంలో సమాచారం ఇవ్వాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఫారంలో క్షేత్ర సందర్శన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిఆర్ టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో చాలా మట్టుకు నాట్లు పూర్తయ్యాయని, గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు తగిన సమాచారం ఇవ్వాలని కోరారు.

హెల్త్ పెన్షన్ల తనిఖీ

కాళ్ల : మండలంలోని ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం హెల్త్ పెన్షన్‌ల తనిఖీలు రెండో రోజు శనివారం నిర్వహించారు. మండలంలో 9 గ్రామాలకు సంబంధించిన పెన్షన్‌ల తనిఖీ నిర్వహించారు. కాళ్ల-1, కాళ్ల-2, కలవపూడి, ప్రాతాళ్లమెరక, జువ్వలపాలెం, ఏలూరుపాడు 1, 2, కాళ్లకూరు, దొడ్డనపూడి-2, మొత్తం-28 పెన్షన్లు తనిఖీ నిర్వహించారు. రెండు రోజుల్లో మొత్తం 52 పెన్షన్లు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్టేట్ టీమ్ డాక్టర్ జి.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్(ఆర్థో), డాక్టర్.సుహాస్, సిఎఎస్-స్పెషలిస్ట్, డాక్టర్ ఎస్.సునీల్, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ డి.సునీత పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపలిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మండలంలోని మోదుగగుంట గ్రామం, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాళ్ల వద్ద నుంచి 22 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని వేరువేరుగా కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే ఎక్సైజ్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా గొలుసు దుకాణాలు నిర్వహిస్తే వాటి వివరాలను 9440902433 లేదా స్టేషన్ ఎస్ఐ మురళీ మోహన్ రావు 9440112437, దొరబాబు 9030737532 నంబర్లకు తెలియజేయాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలిపారు.

ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - గణపవరం

టిడిపి వ్యవస్థాపక నాయకులు, మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారకరామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి గణపవరం అధ్యక్షులు కూచంపూడి సురేంద్రకుమార్ అన్నారు. రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మార్కెట్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జరిగిన వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చిన ఎన్‌టిఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని తెలిపారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కవల కోదండ రాంబాబు, పల్లి వెంకటేశ్వరరావు, సీతారామరాజు, కడగళ్ల చిన్న, కాపవరం చిన్న, సరిపల్లి సూర్పరాజు, ఎండి బషీర్, వంటాకుల శ్రీను పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : తెలుగువారి ఆరాధ్య దైవం అన్న ఎన్‌టిఆర్ అని, వారి సేవలను మరవలేమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా భీమవరం పట్టణం వీరమ్మ చెరువు సెంటర్ వద్ద టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము ఆధ్వర్యంలో 150 మంది పేద మహిళలకు చీరల పంపిణీ చేసి ఘంటసాల పాటల కచేరి నిర్వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ తెలుగు ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన అన్న ఎన్‌టిఆర్ సంక్షేమ పథకాలను అందరూ అవలంబిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, రజక రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీరవాసరం : బడుగు, బలహీన వర్గాలను గుర్తించిన మొదటి వ్యక్తి నందమూరి తారక రామారావు అని టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. ఎన్‌టి రామారావు వర్ధంతిని

వర్ధంతి కార్యక్రమాల్లో టిడిపి నాయకులు

పురస్కరించుకుని శనివారం ఆయనకు టిడిపి శ్రేణులు ఘనంగా నివాళి అర్పించాయి. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లేపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాసరావు, ఎంపిపి వీరవల్లి దుర్గ భవానీ చంద్రశేఖర్, వీరవల్లి సురేష్, అంగర కుటుంబరావులు పాల్గొన్నారు.

ఉండి : టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను శనివారం మండల వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు నిర్వహించారు. ఉండి టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరిమెరక నాగరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా తెలుగువాడి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టిడిపి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, ముదునూరి కృష్ణంరాజు, కాగిత మహంకాళీ, కునుకు శ్రీనివాస్, మజ్జి కృష్ణ ప్రసాద్, గొల్ల విక్టర్ పాల్గొన్నారు.

పెనుగొండ : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా 25 మందికి వయోవృద్ధులు, వితంతువులకు దుప్పట్లు కూటమి నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన శనివారం వడలి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలను అందించిన మహనీయుడని కొనియాడారు. టిడిపి గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి చంటి మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాలలో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతిని అభిమానులు, టిడిపి నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిదిండి కుమార్ బాబు, బొల్లా చంటి, కొల్లాటి భోగరాజు, పాల రాంబాబు, కౌరు నాగేశ్వరరావు, అభిమానులు ఉన్నారు.

ఆకివీడు : టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు ఆయనకు నివాళి ఘటించారు. స్థానిక శ్రీనగర్ కాలనీ, దొరగారి చెరువు గట్టు, అయిభీమవరం రోడ్డులో దుంపగడప కాలవ తూము వద్ద, స్థానిక డైలీ మార్కెట్ సెంటర్లలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి ఘటించారు. అనంతరం స్థానిక సంతపేట, సాలిపేట సెంటర్లలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు స్థానికులతో కలిసి నివాళులు అర్పించారు. ఎన్‌టిఆర్ ఆకివీడు వచ్చిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఆయన పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను పార్టీ మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్ వివరించారు.

నరసాపురం : పట్టణంలోని స్టీమర్ రోడ్డులో శనివారం టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సంకు భాస్కర్ నాయుడు, శిరిగినీడి రాజ్యలక్ష్మి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : టిడిపిని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఎన్‌టి రామారావుకే సాధ్యమైందని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఎంఎల్ఎ కార్యాలయం వద్ద, వేల్పూరు, అత్తిలి, మంచిలి గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సామాన్యుల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిగూడెం పట్టణం శేషమహల్ రోడ్లో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలు పరిశుభ్రంగా ఉండాలి

పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - నరసాపురం

అత్యంత పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది దేశంలో అగ్రగామిగా నిలవాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మనమందరం భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నరసాపురం పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జెసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నరసాపురం పట్టణంలో స్టీమరు రోడ్డు కనకదుర్గమ్మ అర్చి వద్ద నుంచి అన్నా క్యాంటీన్, ఎస్‌బిఐ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వయంగా చీపురు పట్టుకుని రెవెన్యూ, మున్సిపల్, వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి రోడ్లును ఆయన శుభ్రపరిచారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి మూడవ శనివారం ప్రతి నగరం, ప్రతి పల్లె, స్వచ్ఛ ఆంధ్ర పేరున కార్యక్రమాలు చేయటం జరుగుతుందని, దీనిలో భాగంగా నరసాపురం పట్టణంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. ప్రసిద్ధి చెందిన నరసాపురం పట్టణం డివిజన్ హెడ్ క్వార్టరుగా ఉండటం, సుందరీకరణగా తీర్చిదిద్దుకోవటం మన అందరి బాధ్యతని అన్నారు. ఆర్‌డిఒ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లారపు అంజయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రతి ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, గ్రామాన్ని సుందరంగా తీర్చేదిద్దాలని పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం


యలమంచిలిలో పిల్లలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్వాడీలు

పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లిలో మండల స్థాయి స్వచ్ఛ దివస్ స్వచ్ఛందర కార్యక్రమాన్ని శనివారం ఎంపిడిఒ డి.విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిసరాలను స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి పోతుల అన్నవరం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వ్యక్తి స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలనే నినాదంతో ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛత దివస్ నిర్వహించుకోవడానికి ప్రభుత్వం పిలుపునిచ్చిందన్నారు. దీనికి ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్, ఎంపిటిసిలు గోవింద్, సత్యనారాయణ, ఉప సర్పంచి అత్తంటి సోమరాజు పాల్గొన్నారు.

గణపవరం : ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం గణపవరం పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచి మూరా అలంకారం మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తామని చెప్పారు. మండల పరిషత్ ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యలమంచిలి : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం స్వచ్ఛత కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎండి హసీనా మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం అన్ని అంగన్వాడీ కేంద్రాలు, స్కూళ్లలో విద్యార్థులకు పరిసరాల శుభ్రత కోసం చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ టీచర్లు బి.రజిని, భారతి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలోని అరట్లకట్ట అంగన్వాడీ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంను సిడిపిఒ సిహెచ్.ఇందిర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని అంగన్వాడీ కేంద్రాలు కూడా క్లీన్ అండ్ గ్రీన్ గా శుభ్రపరచడం జరిగిందని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రంలో తల్లులు, అంగన్వాడీ సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించి ప్రతిజ్ఞ చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవేణి, సత్యవతి హాజరైయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండి


1999-2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు

మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు తలపించే విధంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా స్కూలు గ్రౌండ్‌లో కాలం గడిపారు. పదో తరగతి పాసై 25 సంవత్సరాలు గడవడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని, విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులంతా కలిసి మెమొంటోలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులు తోటకూర సుశీల, అలగిరి ఆనంద్, అడవి సురేష్ కుమార్, గేదెల వెంకట రామారావు, పద్మజ రాణి, కృష్ణంరాజు తదితర ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన చిన్నారులు తమను గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం మరపురానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'నేడు అమిత్ షా గో బ్యాక్'

భీమవరం : అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రంలో అడుగుపెట్టే హక్కు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. భీమవరం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం జరగబోయే కార్యక్రమానికి సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లడతూ రాజ్యసభలో అంబేద్కర్ అవమానకరంగా, కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్‌షా గో బ్యాక్ అనే నినాదంతో అంబేద్కర్ సెంటర్‌లో వామపక్షాలు, కలసి వచ్చే ప్రజానీకంతో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. అమితాషా గో బ్యాక్ కార్యక్రమంలో ప్రజలు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్‌ని అవమానపరచి వారి అసలు రూపాన్ని బయటపెట్టారన్నారు. ఎంసిపిఐయు నాయకులు పాల్గొన్నారు.

ఉప కారాగారం సందర్శన

నరసాపురం : జైల్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఉప కారాగారాన్ని ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి శనివారం పర్యవేక్షించి నిందితుల కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, న్యాయ సహాయంపై న్యాయమూర్తి ఆరా తీశారు.

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ
'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు

ఆర్.ఒ.సి. నెం. 522/2023-ఇ.1. ది. 18-01-2025

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ.లక్షలలో)
1	జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ స్ట్రీట్ లైట్ల విభాగము నందు 20W, 60W ఎల్ఈడి లైట్స్ మరియు 20W, 70W Drivers సరపర చేయుటకు (జనరల్ ఫండ్స్, 2 పనులు)	2	22.00

సంబంధిత వివరములు https:\tender.epeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 19-01-2025 వ తేది ఉదయం గం. 10-00 ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనర్
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ.